7

సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం | 31 | అక్టోబర్ | 2024



వెండి ఆభరణాల సమర్పణ

తుని రూరల్: లోవ దేవస్థానం తలుపులమ్మ తల్లికి గుంటూరుకు చెందిన అలూరి అనురాధ, శశిధర్ దంపతులు రూ.1.3 లక్షల విలువైన వెండి పాదుకలను ఈఓ పెన్మత్స విశ్వనాథరాజుకు అందజేశారు.




బడుగులపై పిడుగు

వారంతా రోజువారీ కూలీలు.. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు.. దీపావళి బాణసంచా తయారీలో నిమగ్నం అయ్యారు.

8లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 18,891 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.60 అడుగులకు నీటిమట్టం చేరింది. డెల్టా కాలువలకు 8,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

బాలాజీ హుండీ ఆదాయం లెక్కింపు



అప్పనపల్లిలో స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లిలోని బాల బాలాజీ స్వామివారి ఆలయంలో హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మొత్తం 98 రోజులకు గాను రూ.35,00,622లు ఆదాయం సమకూరిందని ఆలయ గ్రేడ్–1 కార్యనిర్వహణాధికారి రాగోలు శ్రీనివాస్ తెలిపారు. అన్నప్రసాదాల నిమిత్తం రూ.52,096లు, 0.08 గ్రాముల బంగారం, 0.120 గ్రాముల వెండి వచ్చిందన్నారు. ఆలయ హుండీ లెక్కింపులో గ్రామస్తులు, పోలీసులు, దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు



పంచారామాలకు సిద్ధం చేసిన ప్రత్యేక బస్సు

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో రాత్రి 7 గంటలకు పంచారామా క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి బుధవారం తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా భక్తుల కోసం ఈ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఎక్స్‌ప్రెస్ సర్వీసుకు రూ.950, అల్ట్రా డీలక్స్‌కు రూ.1,170, సూపర్ లగ్జరీకి రూ.1,220గా టిక్కెట్ ధర నిర్ణయించామన్నారు. బస్సుకు సరిపడా ప్రయాణికులు ఉంటే కావాల్సిన సమయంలో బస్సులు నడుపుతామని వివరించారు. అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. అయ్యప్ప భక్తుల కోసం శబరిమలైకు ప్రత్యేక బస్సులు, మన్యసీమ తదితర టూర్ ప్యాకేజీలు తిప్పుతున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వకుళమాత భవనానికి రూ.1,31,232 విరాళం



గొల్లపల్లి నాగబాబు, దాత

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఏలూరుకు చెందిన గొల్లపల్లి నాగబాబు, శ్రీను కుటుంబ సభ్యులు రూ.1,31,232 విరాళం అందించారు. ఈ విషయాన్ని దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం సూర్యచక్రధర్ రావు తెలిపారు. దాతకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

సత్యదేవుని హుండీ ఆదాయం రూ.1.22 కోట్లు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుడికి గత 30 రోజులకు హుండీల ద్వారా రూ.1,22,41,967 ఆదాయం సమకూరింది. బుధవారం హుండీలను తెరిచి లెక్కించగా నగదు రూ.1,18,20,962, చిల్లర నాణాలు రూ.4,21,005 వచ్చాయ చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ తెలిపారు. వీటితో బాటు బంగారం 10.500 గ్రాములు, వెండి 410 గ్రాములు వచ్చిందని తెలిపారు. గత 30 రోజుల్లో సరాసరిన రోజుకు రూ.4,08,065 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

హుండీలలో విదేశీ కరెన్సీ

సత్యదేవుని దర్శించిన పలువురు ఎన్ఆర్ఐలు పెద్ద మొత్తంలో విదేశీ కరెన్సీని హుండీలలో సమర్పించారు. వాటిలో అమెరికా డాలర్లు 117, కెనడా డాలర్లు 220, యూరోలు వంద, ఖతార్ సెంట్రల్ బ్యాంక్ రియల్స్ 109, ఆస్ట్రేలియా డాలర్లు 50, ఒమెన్ రియల్స్ ఒకటి, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దీరామ్స్ 105, ఇంగ్లాండ్ పౌండ్లు పది, టర్కీ లీరాలు ఐదు, కువైట్ దీనార్లు ఒకటి వచ్చాయి. హుండీ లెక్కింపులో చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్ పాల్గొన్నారు.

నమూనా ఆలయం వద్ద దివీస్ ఆర్వో ప్లాంట్

జాతీయ రహదారిపై నిర్మించిన సత్యదేవుని నూతన నమూనా ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం 'దివీస్ లాబరేటరీస్' ఏర్పాటు చేసిన వేయి లీటర్ల సామర్థ్యం ఉన్న ఆర్వో ప్లాంట్‌ను బుధవారం ఆలయ ఈఈ వి.రామకృష్ణ, ఎలక్ట్రికల్ డీఈ వి.సత్యనారాయణ ప్రారంభించారు.

అధికారుల తెల్లమొహం

- సమస్యలకు సమాధానం కరవు
- ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు నీళ్లు నమిలిన వైనం
- దిశా సమావేశాలకు కీలక శాఖలు దూరం



దిశా సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సాక్షి, అమలాపురం: ఏ శాఖకైనా జవాబుదారీతనం ఉండాలి.. ప్రతి సమస్యకూ పరిష్కారం చూపగలగాలి.. ఇక కీలక సమావేశాల్లో ప్రజాప్రతినిధులు అడిగే ప్రతి ప్రశ్నకూ వివరణ ఇవ్వగలగాలి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక అధికార వ్యవస్థలో నిర్లిప్తత అమలుకుంది. ఈ విషయం దిశా సమావేశంలో తేటతెల్లమైంది. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు చదివి వినిపించడం తప్ప, సమస్యలపై ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తే మాత్రం వివరాలు చెప్పలేకపోయారు. బుధవారం అమలాపురం కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి కమిటీ సమన్వయ సమావేశం (దిశా) ఎంపీ గంటి హరీష్ మాధుర్ అధ్యక్షతన జరిగింది. ఇందులో సుమారు 22 శాఖల పరిధిలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై చర్చించాల్సి ఉంది. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు సుదీర్ఘంగా మాట్లాడడంతో చర్చించేందుకు సమయం లేక కేవలం వైద్య ఆరోగ్యం, విద్యుత్, విద్యా శాఖ, డ్వామా, క్రీడల శాఖల పరిధిలో జరిగిన పనులపై మాత్రమే చర్చించి వదిలేశారు. కీలకమైన డీఆర్‌డీఏ, గృహ నిర్మాణం, వ్యవసాయం, పంచాయతీ రాజ్, డీఆర్‌డీఏ, సర్వే ల్యాండ్ రికార్డులు, పౌర సరఫరాలు, ఇరిగేషన్ వంటి కీలక శాఖలపై సమీక్ష జరగలేదు.

ప్రశ్నించిన ఎమ్మెల్సీలు

దిశా సమావేశంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలను వేదికపైకి పిలిచిన అధికారులు వైఎస్సార్ సీపీకి చెందిన ఎమ్మెల్సీలను మాత్రం పిలవలేదు. దీనిపై ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, తోట త్రిమూర్తులు మండిపడ్డారు. తమను ఎందుకు పిలవలేదని నిలదీశారు. దీంతో ఎంపీ హరీష్ కలగజేసుకుని ఎమ్మెల్సీలను సైతం వేదికపైకి పిలవాలని అధికారులకు సూచించారు. ఈ సమయంలో ఎమ్మెల్యే కుడుపూడి సూర్యనారాయణరావు పేరు తప్పుగా పిలవడంతో కుడుపూడి మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు మీరు చదువుకునే ఉద్యోగాలు సంపాదించారా? అని నిలదీశారు. చివరికి వారిని వేదికపైకి ఆహ్వానించారు.

అసహనం.. ఆగ్రహం

దిశా సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలకు, ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పలేకపోయారు. అధికారుల తీరుకు చివరకు అధికార పార్టీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు సైతం అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలోని పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న సిబ్బందికి కనీస సౌకర్యాలు కల్పించడం లేదని సమస్య లేవనెత్తారు. అమలాపురం ఏరియా ఆసుపత్రిలో 40 గదులు ఖాళీగా ఉండడం, ఎన్టీఆర్ హెల్త్ స్కీమ్ వంటి విషయాలపై డీఎంహెచ్ఓ దొర సరైన సమాధానాలు చెప్పకపోవడంతో ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాలకు కనీసం ప్రిపరేషన్ లేకుండా ఎలా వస్తున్నారని ప్రశ్నించారు.

ఎన్టీఆర్ ఇన్సూరెన్స్ గణంకాలను తప్పుగా నమోదు చేయడంపై ఎంపీ హరీష్ మాధుర్, కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌లు క్లాస్ తీసుకున్నారు. అంగర పీహెచ్‌సీలో పనిచేస్తున్న గైనకాలజిస్ట్ డిప్యూటేషన్‌పై వెళ్లగా తిరిగి పంపిస్తామని డీఎంహెచ్ఓ హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకూ అది నెరవేరలేదని ఎంపీపీ మేడిశెట్టి సత్యవాణి ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వర రావు అధికారులను గట్టిగా నిలదీశారు.

పీహెచ్‌సీల నిర్వహణకు రూ.1.75 లక్షల నిధులు సరిపోవడం లేదని, వీటిని కనీసం రూ.ఐదు లక్షలకు పెంచాలని కొత్తపేట ఎంపీపీ మార్గాని గంగాధర్ కోరారు. అద్దంకివారిలంక, కేదార్లంక, నారాయణలంక గ్రామాల వాసులకు అయినవిల్లి, కొత్తపేట పీహెచ్‌సీ, సీహెచ్‌సీల నుంచి వైద్య సేవలందేలా చూడాలని కోరారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విద్యుత్ లోఓల్టేజీ సమస్యను లేవనెత్తారు. ఇంచుమించు అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే సమస్య ఉందన్నారు. తాగునీటి సమస్య ఇప్పటికే నెలకొందని, ఇలాగైతే వచ్చే వేసవిలో నీరు అందించగలరా అని ప్రశ్నించారు. మంచినీటి పథకాలకు సంబంధించి ఓవర్ హెడ్ ట్యాంకు క్లీనింగ్, నిర్వహణకు 33 శాతం లెస్‌కు టెండర్లు వేయడాన్ని ప్రజాప్రతినిధులు తప్పుపట్టారు. అటువంటి వారు పనులు ఏం చేస్తారని అన్నారు. జిల్లాలో అసలు క్రీడాభివృద్ధి సంఘం పనిచేస్తుందా? అని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు విరుచుకుపడ్డారు. ఉపాధి హామీ పథకం అమలులో పంచాయతీలకు, మండల పరిషత్‌లకు అధికారులు లేకుండా చేస్తున్నారని ఎంపీపీ గంగాధర్‌తోపాటు పలువురు ప్రశ్నించారు. కేవలం సంతకాలు పెట్టడానికే పరిమితం చేశారని, పనుల కేటాయింపుల్లో 50 శాతం ఎంపీపీలకు, ఎంపీటీసీ సభ్యులకు అధికారం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో గుర్రపుడెక్క, రోడ్లు వెంబడి జంగిల్ క్లియరెన్స్ లేకపోతే కూలీలకు పనులు కల్పించలేరని ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. పట్టణ ఆరోగ్యశాఖ, మెప్మా అధికారులు సమావేశానికి రాకపోవడాన్ని ఎమ్మెల్యేలు తప్పుపట్టారు. అసలు జిల్లాలో వారు భాగస్వామ్యులా కాదా అని ప్రశ్నించారు.

వేగుళ్ల యాక్షన్.. తోట రియాక్షన్



ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుల మధ్య వాగ్వాదం

శాఖల వారీగా చేపట్టిన పనులపై చర్చ జరుగుతున్న సమయంలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు రాజకీయ ప్రస్తావన తీసుకు వచ్చారు. గత ప్రభుత్వ హయాంలో తనకు ఎమ్మెల్యేగా గౌరవం ఇవ్వలేదని, కేశవరంలో గ్రావెల్ తవ్వకాలను అడ్డుకునేందుకు వెళితే పోలీసులను పెట్టి తనను అడ్డగించారని, ఇసుక దోపిడీ చేశారని వేగుళ్ల విమర్శలకు దిగారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అదే స్థాయిలో స్ట్రాంగ్ రియాక్షన్ ఇచ్చారు. అభివృద్ధిపై మాట్లాడమని తమకు చెప్పి మీరు రాజకీయాలు ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. వాటిపై చర్చ పెట్టాలంటే మరో సమావేశం ఏర్పాటు చేయాలని, తాను వచ్చి సమాధానం చెబుతానని సవాల్ విసిరారు. ఈ సమయంలో అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు కలగజేసుకుని ఇది అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడే సమావేశమన్నారు. దీనికి స్పందించిన తోట మాట్లాడుతూ ముందు ఆ విషయాన్ని మీ పార్టీ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు చెప్పండని చురక అంటించారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు, గిడ్డి సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్రమణి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఛారిష్మ



జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన ఛారిష్మ

అంబాజీపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) నిర్వహించనున్న బాస్కెట్ బాల్ అండర్–17 జాతీయ పోటీల్లో పాల్గొనే ఆంధ్ర ప్రదేశ్ జట్టుకు అంబాజీపేటకు చెందిన నిమ్మకాయల ఛారిష్మ సాయి రుత్వి ఎంపికైంది. అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఛారిష్మ ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. ఆ పోటీల్లో తూర్పు గోదావరి జిల్లా జట్టు మూడో స్థానంలో నిలవగా, జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన ఛారిష్మ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కడలి సాయిరాం, పీడీ కె.ఆదిలక్ష్మి తెలిపారు. త్వరలో తమిళనాడులో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొనుంది. ఛారిష్మ ఎస్‌జీఎఫ్ తరఫున గతంలో అండర్–14 విభాగంలో రెండుసార్లు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యింది. రాజస్థాన్‌లోని బార్మర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. సబ్ జూనియర్స్ విభాగంలో సైతం రాష్ట్రజట్టుకు ఎంపికై పుదుచ్చేరిలో జరిగిన జాతీయ పోటీల్లో పాల్గొంది. వాలీబాల్‌లో సైతం రాణిస్తూ సబ్ జూనియర్స్ విభాగంలో ఉమ్మడి తూర్పు గోదావరి జట్టుకు ఎంపికైంది. జాతీయ పోటీలకు ఎంపికైన ఛారిష్మను జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, డీఈఓ సలీం బాషా, డీవైఈఓ మధుసూదనరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, పీఈటీ ఎ.సూర్యకుమారి అభినందించారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలపై అఘాయిత్యాలు



మాజీ ఎంపీ చింతా అనురాధ

అల్లవరం: కూటమి ప్రభుత్వంలో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు అధికమయ్యాయని, దీనిపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జాతీయ మానవ హక్కుల సంఘానికి మంగళవారం ఫిర్యాదు చేశామని మాజీ ఎంపీ చింతా అనురాధ బుధవారం తెలిపారు. న్యూ ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్ విజయభారతి, జాతీయ మహిళా కమిషన్ కార్యదర్శి మీనాక్షిని కలసి మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఫిర్యాదు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 77 మంది మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరిగినా సీఎం చంద్రబాబు పట్టించుకోవడం లేదన్నారు. అక్రమ మద్యం, ఇసుక దందా జరుగుతున్నా, ఆడబిడ్డలకు రక్షణ లేకపోయినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళల కోసం ఏర్పాటైన దిశ చట్టాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరదు కళ్యాణి, ఎంపీలు గురుమూర్తి, తనుజారాణి, మాజీ ఎంపీ జి.మాధవిలతో కలసి ఫిర్యాదు చేశామని అనురాధ వివరించారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ, జాతీయ మహిళా కమిషన్ సానుకూలంగా స్పందించిందన్నారు.

వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు గైట్ విద్యార్థిని

రాజానగరం: ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నవంబర్ 12 నుంచి 21 వరకు జరిగే ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఆంధ్రా యూనివర్సిటీ తరఫున గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఫర్జానా ఆఫ్మీ మొహ్మద్ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ధనరాజ్ తెలిపారు. కేబీసీ నార్త్ మహారాష్ట్ర యూనివర్సిటీ(జలగావ్)లో జాతీయ స్థాయిలో ఈ పరేడ్ జరగనుంది.

రేపటి నుంచి అధ్యాపకుల ఆమరణ దీక్ష



అధ్యాపకులకు సంఘీభావం తెలిపిన ప్రజా సంఘాల నాయకులు

మలికిపురం: తమ పెండింగ్ జీతాలు చెల్లించాలని మలికిపురం ఎంవీఎన్ జేఎస్–ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు చేస్తున్న నిరసన దీక్షలు బుధవారంతో 50వ రోజుకు చేరుకున్నాయి. సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ముందుకు రాకపోవడంతో వచ్చే నెల ఒకటి నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేయనున్నట్లు అధ్యాపక సంఘం పేర్కొంది. ఈ మేరకు బుధవారం సంఘ ఓ ప్రకటన విడుదల చేసింది. సానుకూలంగా సమస్యను పరిష్కరించాల్సిన కాలేజీ సెక్రటరీ కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణ మూర్తి అందుకు విరుద్ధంగా ప్రవర్తించడం శోచనీయమని అధ్యాపకులు అన్నారు. బుధవారం దీక్షకు పలు ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. సమస్య ఇంత పెద్ద స్థాయికి వెళ్లడం వెనుక కరస్పాండెంట్ కుట్ర దాగి ఉందని నాయకులు అన్నారు. తాడి రంపాలరాజు, రాజు, నల్లి శివకుమార్, బీఎస్పీ నాయకులు జాన్ మోషే, సూర్యప్రకాష్‌రావు తదితరులు మద్దతు తెలిపారు.

ఆర్చరీలో బుద్ధేశ్వరరావు ప్రతిభ



ఆర్చరీ క్రీడాకారుడు బుద్ధేశ్వరరావును సత్కరిస్తున్న జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లికి చెందిన కర్రి బుద్ధేశ్వరరావు ఇటీవల న్యూ ఢిల్లీలో జరిగిన సీబీఎస్ఈ నేషనల్ ఆర్చరీ కాంపౌండ్ అండర్–17 విభాగ పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. నవంబర్ 10న గుజరాత్ రాష్ట్రం లడియాలో జరగబోయే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ ఆర్చరీ పోటీలకు కూడా బుద్ధేశ్వరరావు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా స్థానిక హెల్త్ ఫిట్‌నెస్ జిమ్‌లో ఆర్చరీ విజేత బుద్ధేశ్వరరావును జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ బుధవారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు మాట్లాడుతూ బుద్ధేశ్వరరావు చిరు ప్రాయంలోనే ఆర్చరీ క్రీడలో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి పతకాన్ని పట్టి అమలాపురానికి పేరు తెచ్చానని పేర్కొన్నారు. అరుదైన క్రీడలో రాణించేలా ప్రోత్సహించిన బుద్ధేశ్వరరావు తండ్రి కర్రి నాగేశ్వరరావును కూడా అభినందించారు. బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, పవర్ లిఫ్టింగ్ కోచ్ మట్టపర్తి వెంకట సముద్రం, జిమ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులకు హెల్త్ ఇన్సూరెన్స్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి

సాక్షి, అమలాపురం: సంక్షేమ వసతి గృహాలు, జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థుల ఆరోగ్య భద్రతకు ఐసీఐసీఐ లాంబార్డ్ ఇన్సూరెన్స్ కల్పనకు చర్యలు చేపట్టామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం ఐసీఐసీఐ లాంబార్డ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు, నెట్‌వర్క్ ఆసుపత్రి యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి విధి విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాలు, జూనియర్ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు అనారోగ్యం పాలైన సందర్భంలో నర్సులు ప్రాథమిక చికిత్స చేసి వారి తల్లిదండ్రులకు అప్పగిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లల అనారోగ్య పరిస్థితులను చూసి చలించిపోయి ఆర్థిక స్తోమత లేకపోయినా ఆసుపత్రిల్లో వైద్యం చేయించి ఆర్థికంగా ఇబ్బందులు పాలవుతున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వసతి గృహాలు, జూనియర్ కళాశాలల విద్యార్థినీ విద్యార్థుల వివరాలను నెట్‌వర్క్ ఆసుపత్రులకు మ్యాపింగ్ చేస్తూ వారి డేటాను ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. దాని ఆధారంగా అక్కడకు వెళ్లి వైద్య సేవలను పొందవచ్చని తెలిపారు. ఐసీఐసీఐ లాంబార్డ్ ఇన్సూరెన్స్ అధికారి శ్రీనివాసు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొర, డీసీహెచ్ కార్తీక్ పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్‌కు శ్రీకారం

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలెండర్లు ఉచితంగా దీపం–2 పథకం అమలుకు శ్రీకారం చుట్టిందని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్ నుంచి బుధవారం రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్ కంపెనీల వద్ద బుకింగ్స్ ప్రారంభమైనట్లు తెలిపారు. నవంబర్ ఒకటో తేదీన ముఖ్యమంత్రి ఉదయం 10 గంటలకు ఇచ్ఛాపురంలో ఉచిత సిలిండర్ పంపిణీ ప్రారంభిస్తారని, అదే సమయంలో నియోజకవర్గాల వారీగా ఉచిత సిలిండర్ల పంపిణీని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల వద్ద పటిష్ట భద్రత

- జిల్లాలో 492 దుకాణాలకు అనుమతి
- 8 చోట్ల అగ్నిమాపక అవుట్ పోస్టుల ఏర్పాటు



అమలాపురం బాలయోగి స్టేడియంలో బాణసంచా దుకాణాల వద్ద అగ్నిమాపక అవుట్ పోస్టులో సిబ్బంది

అమలాపురం టౌన్: జిల్లాలో దీపావళి సందర్భంగా బుధ, గురువారాల్లో బాణసంచా విక్రయ దుకాణాల వద్ద అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే బాణసంచా దుకాణాల సముదాయాల వద్ద పోలీసు బందోబస్తు సిద్ధంగా ఉంచారు. జిల్లాలో మొత్తం 492 దుకాణాలకు అధికారులు తాత్కాలిక లైసెన్స్‌లు జారీ చేశారు. అమలాపురం, రామచంద్రపురం, మండపేట పట్టణాలతో పాటు ముమ్మిడివరం నగర పంచాయతీ, మేజర్ పంచాయతీలైన మలికిపురం, రావులపాలెం, రాజోలు, అంబాజీపేట, పి.గన్నవరం, తాటిపాక, ద్వారపూడి, కపిలేశ్వరపురం తదితర ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేశారు. అలాగే జిల్లాలో 385 గ్రామాలకు సంబంధించి జన సాంద్రత అధికంగా ఉన్న గ్రామాల్లో కూడా దుకాణాలు వెలిశాయి. అమలాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 266, రామచంద్రపురం డివిజన్‌లో 99, కొత్తపేట డివిజన్‌లో 127 దుకాణాలకు ఆయా డివిజన్ల ఆర్డీఓలు కె.మాధవి, దేవరకొండ అఖిల, శ్రీకర్‌లు అనుమతులు జారీ చేశారు. అమలాపురం, కొత్తపేట, ముమ్మిడివరం, రాజోలు, రావులపాలెం, మలికిపురం, రామచంద్రపురం, మండపేట ప్రాంతాల్లో బాణసంచా దుకాణాల సముదాయాల వద్ద అవుట్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు జిల్లా అగ్నిమాపక అధికారి ఎన్.పార్థసారథి తెలిపారు. దుకాణాల్లో అగ్ని ప్రమాదం అనివార్యమైతే మంటలను అదుపు చేసే యంత్రాలు, పరికరాలను అక్కడ అందుబాటులో ఉంచారు. ప్రతి బాణసంచా దుకాణం వద్ద డ్రమ్ముల్లో నీటి నిల్వలు, కొన్ని బకెట్ల ఇసుకను ఉంచాలని ఆదేశాలు ఇచ్చారు. అమలాపురం బాలయోగి స్టేడియం వద్ద ఏర్పాటైన దుకాణాలను స్థానిక అగ్నిమాపక దళాధికారి కేవీ మురళీ కొండబాబు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

మధ్య లంకలో ఎలుగుబంటి సంచారం!


ఎలుగుబంటిని చూశామని చెబుతున్న మత్స్యకారులు

మామిడికుదురు: పాశర్లపూడి లంక గ్రామ పరిధిలోని గోదావరి మధ్య లంకలో కొన్ని రోజుల నుంచి ఎలుగుబంటి సంచరిస్తుందని స్థానిక మత్స్యకారులు అంటున్నారు. రాత్రి వేటకు వెళుతున్న సమయంలో దానిని చూసి కంగారు పడ్డామని మత్స్యకారులు భైరవస్వామి, నూకరాజు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. చూడడానికి భయంకరంగా భారీగా ఉన్న జంతువును ఎలుగుబంటిగా అనుమానిస్తున్నామన్నారు. జంతువు సంచారంతో రాత్రి సమయంలో వేటకు వెళ్లేందుకు భయం వేస్తుందన్నారు. దీనిపై అటవీ శాఖ అధికారులు స్పందించి ఆ జంతువు బారి నుంచి మత్స్యకారులకు రక్షణ కల్పించాలని సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాష్ కోరారు.

అయ్యప్ప భక్తుడిపై నీటి పిల్లి దాడి!


గాయపడిన విజయ్‌కుమార్

ఆలమూరు: స్థానిక పెద్దకాలువ రేవులో స్నానం చేస్తున్న అయ్యప్ప భక్తుడిపై నీటి పిల్లి దాడి చేసిన సంఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారుడు పి.విజయ్‌కుమార్ వేకువజామునే స్నానం చేయడానికి రేవు వద్దకు వెళ్లాడు. స్నానం చేస్తుండగా అంతలో నీటిలో నుంచి పిల్లి అతనిపై దూకి గాయపర్చింది. భయాందోళన చెందిన విజయ్‌కుమార్ భయాందోళనతో పరుగున ఒడ్డుకు చేరుకున్నాడు. స్థానికుల సాయంతో ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అయితే 1 నుంచి కార్తికమాసం ప్రారంభం కావడంతో అనేక మంది భక్తులు ఈ రేవుకు వచ్చి స్నానాలు ఆచరించడం ఆనవాయితీగా వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో మునుపెన్నడూ లేని విధంగా నీటి పిల్లి దాడి చేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

వీఓఏ తొలగింపునకు ఉత్తర్వులు

మలికిపురం: పడమటిపాలెం డీఆర్‌డీఏ వెలుగు వీఓఏ యడ్ల సుమలతను తొలగించాలని సూచిస్తూ జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ శివ శంకర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం గ్రామ సభలో వీఓఏ సుమలత పలు అక్రమాలకు పాల్పడ్డారని, తమ రుణాల నగదును దారి మళ్లించారని గ్రామ నీ కృపా డ్వాక్రా సంఘ సభ్యులు నల్లి గీత, కొప్పాడి సత్యమణి, తాడి మేరి తదితరులు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఆర్‌డీఏ, వెలుగు సిబ్బంది విచారణ జరిపి అక్రమాలు గుర్తించారు. నిధులు మళ్లించడంతో పాటు సెర్ప్ వెబ్‌సైట్‌లో సభ్యుల పేర్లు నమోదు చేయలేదని, గ్రూపుల నిర్వహణ కూడా సక్రమంగా లేదని తెలుసుకున్నారు. వీఓఏ అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించడంతో తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మండల వెలుగు ఏపీఎంకు సూచిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. పీడీ శివశంకర్ విలేకరులతో మాట్లాడుతూ ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసినట్లు ధ్రువీకరించారు.

బడుగులపై పిడుగు

- బాణసంచా తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం
- పిడుగు పడి భారీ విస్ఫోటం
- ఇద్దరి దుర్మరణం, ఐదుగురికి తీవ్ర గాయాలు
- బాధితులంతా పశ్చిమగోదావరి జిల్లా వాసులు
- ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో ఘటన


తణుకు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట బంధువుల రోదనలు

చుక్కా పెద్దింట్లు


విప్పర్తి వెంకటేశ్వరరావు


మందలంక కమలరత్న


శీలం లక్ష్మి


కడిమి కుమారి

తణుకు: వారంతా దినసరి కూలీలు.. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు.. దీపావళి బాణసంచా తయారీలో నిమగ్నం అయ్యారు. అప్పటికే వర్షం కురుస్తుండటంతో అనుకోని రీతిలో అక్కడే కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. పిడుగు ధాటికి బాణసంచా కేంద్రంలో విస్ఫోటం సంభవించింది. తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన వేగిరోతు శ్రీవల్లి (50), పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన గుమ్మడి సునీత (35) ఘటనా స్థలంలోనే మృతి చెందగా, కడిమి కుమారి (దువ్వ), చుక్కా పెద్దింట్లు (దువ్వ), మందలంక కమలరత్న (రావిపాడు), శీలం లక్ష్మి (రావిపాడు), విప్పర్తి వెంకటేశ్వరరావు (కావలిపురం) తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే 90 శాతం కాలిన గాయాలు ఉండటంతో వీరందరినీ ఏలూరు ఆశ్రమ్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో క్షతగాత్రులను తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావులు పరామర్శించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అరుణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారణాసి పర్యటనలో ఉన్న మంత్రి కందుల దుర్గేష్ ఈ ఘటనపై ఆరా తీసి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు.

బాధితులంతా రోజువారీ కూలీలే..

బాణసంచా తయారీ కేంద్రంలో పని చేస్తున్న వారంతా రోజువారీ కూలీలే. ప్రతి ఏడాది దీపావళికి రెండు నెలల ముందు నుంచి బాణసంచా తయారీ కేంద్రంలో కూలీలు పనిచేస్తుంటారు. తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన వేగిరోతు శివకు చెందిన బాణసంచా తయారీ కేంద్రంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. కొన్నేళ్లుగా తణుకు మండలం దువ్వ వెంకయ్య వయ్యేరు ఆనుకుని తోటల్లో బాణసంచా తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేవారు. అయితే గతేడాది దువ్వలో లైసెన్సు ఇవ్వకపోవడంతో పశ్చిమగోదావరి జిల్లా సరిహద్దు గ్రామమైన ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం నుంచి కాల్దరి వెళ్లే రోడ్డులో తయారీ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రంలో సుమారు 20 మంది కూలీలు పని చేస్తున్నారు.

ఏడేళ్ల క్రితం తల్లిదండ్రులు.. ఇప్పుడు భార్య

కొన్నేళ్లుగా బాణసంచా తయారీ కేంద్రాన్ని కుటీర పరిశ్రమగా వేగిరోతు శివ నిర్వహిస్తున్నారు. సుమారు ఏడేళ్ల క్రితం దువ్వ గ్రామంలోని తన నివాసంలో బాణసంచా నిల్వలు పేలిపోవడంతో శివ తల్లిదండ్రులు సజీవ దహనం అయ్యారు. అయినప్పటికీ తయారీ కేంద్రం కొనసాగిస్తున్నారు. బుధవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో శివ తన భార్య వేగిరోతు శ్రీవల్లి ప్రాణాలు కోల్పోయారు. దీంతో కుటుంబంలో తల్లిదండ్రుల తోపాటు భార్యను కూడా తాను నమ్ముకున్న కుటీర పరిశ్రమ మింగేయడం గమనార్హం.

20 రోజుల క్రితమే అల్లుడి మృతి

కావలిపురం గ్రామానికి చెందిన విప్పర్తి వెంకటేశ్వరరావు కొన్నేళ్లుగా బాణసంచా తయారీ కేంద్రంలో పని చేస్తున్నారు. సీజన్ పూర్తయ్యాక ఇటుకల బట్టీలో పని చేస్తుంటారు. వెంకటేశ్వరరావు, కుమారి దంపతులకు కుమారుడు, కుమార్తె కాగా కుమార్తె లక్ష్మీశోభకు గొల్లపల్లి సురేష్‌తో వివాహం చేశారు. అయితే 20 రోజుల క్రితమే అల్లుడు సురేష్ గుండెపోటుతో మృతి చెందడం పట్ల ఆ కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది.

- తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన కడిమి కుమారి భర్త త్రిమూర్తులు కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. కుమారుడు జయరాజు తాపీ పని చేసుకుంటున్నారు. గతంలో ఎప్పుడూ ఈ పనికి వెళ్లని కుమారి రెండు నెలలుగా ఈ పనికి కుదిరింది. కొన్నేళ్లుగా ఐస్‌క్రీం ఫ్యాక్టరీకు వెళుతున్న కుమారి డబ్బులు ఎక్కువ వస్తున్నాయని బాణసంచా తయారీ కేంద్రంలో చేరింది. అనుకోని రీతిలో జరిగిన ప్రమాదంలో కుమారి తీవ్రంగా గాయపడింది.
- పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన మందలంక కమలరత్న నాలుగు రోజుల నుంచే పనిలోకి వెళుతోంది. కమలరత్నం వెంకట్రావు దంపతులకు ఇద్దరు కుమారులు కాగా వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు.
- పెంటపాడు మండలం శీలం లక్ష్మి రెండు నెలలుగా ఇక్కడే పని చేస్తున్నారు. భర్త దుర్గారావు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ దుర్ఘటనలో లక్ష్మికి తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.
- తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన చుక్కా పెద్దింట్లు నెల రోజులుగా బాణసంచా తయారీ కేంద్రంలో పని చేస్తున్నారు. భర్త ముసలయ్య కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. సాధారణ రోజుల్లో పెద్దింట్లు వంట పనులకు వెళుతూ ఉంటుందని కుమార్తె ప్రసన్న ప్రవల్లిక చెబుతున్నారు.

కబడ్డీ క్రీడాకారుల ఎంపికలో పక్షపాతం

ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యుల ఆవేదన


సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు

సామర్లకోట: యూనివర్సిటీ రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టులో క్రీడాకారుల ఎంపిక పక్షపాతంగా జరిగిందని ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపించారు. బుధవారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు విలేకర్ల సమావేశంలో జట్టు ఎంపికపై విమర్శలు చేశారు. ఇటీవల మండపేటలో జరిగిన ఎంపికల్లో ఆదికవి నన్నయ యూనివర్సిటీకి చెందిన టీమ్‌లో అత్యంత ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను పక్కన పెట్టారని కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీను, ఉపాధ్యక్షుడు కిరణ్, సహాయ కార్యదర్శి సరోజ్ వాసులు ఆరోపించారు. జట్టులో నన్నయ యూనివర్సిటీకి చెందిన క్రీడాకారుడు వెంకట్ 50 పాయింట్లకు 40 పాయింట్లు తీసుకు వచ్చినా అన్యాయం జరిగిందన్నారు. సెలక్షన్ కమిటీలో సభ్యులుగా ఉన్న నరసింహరాజు, మూర్తి, ప్రభాకర్‌లకు కబడ్డీలో ఎటువంటి అనుభవం లేదన్నారు. ఠాగూర్, అనిల్ డిఫెన్స్‌లో ప్రతిభ కనబర్చారని తెలిపారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను పట్టించుకోక పోతే వారికి గుర్తింపు ఎప్పుడు వస్తుందని ప్రశ్నించారు. సెలక్షన్ కమిటీలు సక్రమంగా లేకపోతే రాష్ట్రం, దేశంలోనే క్రీడాకారులు కనుమరుగై పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. యూనివర్సిటీకి చెందిన కబడ్డీ క్రీడాకారులకు న్యాయం చేయాలని నన్నయ యూనివర్సిటీ వైస్ చాన్సిలర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని, ఇప్పటి వరకూ న్యాయం జరగలేదన్నారు. క్రీడాకారులైన వెంకట్, ఠాగూరు, అనిల్‌లు తమకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. యూనివర్సిటీలో ఇదే తమకు చివరి అవకాశమని వారు అన్నారు. క్రీడాకారుల ప్రతిభను గుర్తించాల్సిన సెలక్షన్ కమిటీ తప్పుదారి పట్టడంపై పలువురు విమర్శించారు. ఇప్పటికైనా ప్రతిభ కలిగిన క్రీడాకారులకు గుర్తింపు ఇవ్వాలని కోరుతున్నారు.

ఏం జరుగుతోందబ్బా..

- ఉమ్మడి జిల్లాలో సీఐడీ సోదాలు
- ఉదయం నుంచి రాత్రి వరకూ తనిఖీలు


ఆవపాడులోని ఎంఎం బయోటెక్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీఐడీ అధికారులు

రాయవరం: సీఐడీ అధికారులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన తనిఖీలు చర్చనీయాంశమయ్యాయి. రాయవరం మండలం చెల్లూరులోని శ్రీసర్వారాయ షుగర్ ఫ్యాక్టరీలో సోదాలు చేశారు. విశాఖపట్నం నుంచి సీఐడీ అధికారులు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బందోబస్తు కోసం సంప్రదించినట్లు తెలిసింది. బుధవారం ఉదయం వరకూ ఎక్కడ విచారణ జరుపుతుందీ కూడా గోప్యంగా ఉంచి, ఉదయాన్నే చెల్లూరు సర్వారాయ షుగర్ ఫ్యాక్టరీకి వెళ్లారు. సుమారు ఐదుగురు అధికారులు ఈ తనిఖీల్లో పాల్గొన్నట్లు సమాచారం. ఉదయం లోపలకు ప్రవేశించిన వారు రాత్రి 7.30 గంటల వరకూ సోదాలు చేస్తున్నట్లు తెలిసింది. షుగర్ ఫ్యాక్టరీ మూతపడి ఉండగా, డిస్టలరీలో మొలాసిస్ ఉత్పత్తి అవుతున్నట్లుగా సమాచారం. మొలాసిస్‌ను ఫిల్టర్ చేస్తే ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఈఎన్‌ఏ) ఉత్పత్తి అవుతుంది. అయితే ప్రస్తుతం సీఐడీ అధికారులు చేస్తున్న సోదాలు ఈఎన్‌ఏ ఉత్పత్తికి సంబంధించినదా? కాదా? అనేది పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. గతంలో ఇక్కడ ఉత్పత్తయిన స్పిరిట్ ఏ ఏ ప్రాంతాలకు సరఫరా చేశారనే విషయాలపై ప్రధానంగా రికార్డులు తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై రాయవరం ఎస్సై పి.బుజ్జిబాబును వివరణ కోరగా, తన వద్ద ఎటువంటి సమాచారం లేదన్నారు.

ఆకస్మిక తనిఖీలు

తాళ్లపూడి: మండలంలోని తుపాకులగూడెం రెవెన్యూ పరిధిలో రెండు బెవరేజస్ ఫ్యాక్టరీలపై బుధవారం ఏకకాలంలో సీఐడీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఉదయం 9 గంటల సమయానికి రెండు బృందాలుగా వచ్చి రెండు ఫ్యాక్టరీల్లోకి సీఐడీ అధికారులు వెళ్లారు. విజయవాడకు చెందిన సీఐడీ అధికారులు కేప్రికార్న్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్, అదేవిధంగా బీ9 బెవరేజస్ లిమిటెడ్ (బీర్) ఫ్యాక్టరీల్లో తనిఖీలు చేపట్టారు. వారితో పాటు రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది ఉన్నారు. ఇతరులను లోపలకు అనుమతించలేదు. ఎటువంటి సమాచారం బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. సాయంత్రం వరకూ తనిఖీలు కొనసాగాయి. పలు రికార్డులను పరిశీలించి కొన్నింటిని స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఈ సమాచారం విజయవాడలోని కార్యాలయానికి అందజేస్తామని అధికారులు తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు


లాన్ టెన్నిస్ పోటీల్లో విజేతలకు పతకాలు అందిస్తున్న అతిథులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు. స్థానిక జిల్లా క్రీడా మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-14, 17, 19 అంతర్ జిల్లాల లాన్ టెన్నిస్ పోటీలు బుధవారంతో ముగిశాయి. పోటీల ముగింపు కార్యక్రమానికి కాకినాడ జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కేవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా శ్రీనివాస్ కుమార్, గౌరవ అతిథిగా తలాటం హరీష్, రాష్ట్ర లాన్ టెన్నిస్ సంఘ కార్యదర్శి పీవీ రామ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి విజేతలు జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. మూడు రోజుల పాటు జరిగిన పోటీలను ఎస్‌జీఎఫ్‌ఐ రాష్ట్ర పరిశీలకుడు బాబు, వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహించామన్నారు. టోర్నమెంట్ చీఫ్ రిఫరీ శ్రీకుమార్‌ను అభినందించారు. అనంతరం విజేతలకు అతిథులు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. పోటీల నిర్వహణ కార్యదర్శి జార్జి, ఎస్‌జీఎఫ్‌ఐ సంయుక్త కార్యదర్శులు సునీల్, పరశురాం, బి.సురేష్‌రాజు, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, కార్యదర్శి నూకరాజు, కోశాధికారి కౌర్, పీడీలు సూరిబాబు, ఇమ్మానుయేల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

అండర్-19 బాలికల విభాగంలో టి.హిమజరెడ్డి (చిత్తూరు), వై.భావన (విశాఖ), ఎస్‌డీ టోహిప్‌కా (విశాఖ), కె.వైష్ణవి (అనంతపురం), టి.మోక్ష (విశాఖ), బాలుర విభాగంలో బి.కరుణ కుమార్ (చిత్తూరు), ఎస్.చరణ్ కుమార్ (గుంటూరు), షేక్ అబుబక సిద్దిక్ (చిత్తూరు), పి.జీవన్ గౌతమి (గుంటూరు), ఎస్‌కే అబరార్ అహ్మద్ (గుంటూరు) జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. అండర్-17 బాలికల విభాగంలో టి.వి.ఏమ (నెల్లూరు), జి.జోషిత(గుంటూరు), ఎ.మనస్వి (చిత్తూరు), జి.మేధశ్రీ (తూర్పు), ధన్విశ్రీ (చిత్తూరు), బాలుర విభాగంలో వై.ఇషాన్ (కృష్ణా), డి.సాయిశంకర్ (కర్నూలు), కె.శౌర్య (విశాఖ), టి.విశ్రుత్ సాయి (నెల్లూరు), బి.యశ్వంత్ (విశాఖ), అండర్-14 విభాగంలో కె.విన్సెంట్ (గుంటూరు), వి.భువన్ ధీరజ్ (పశ్చిమ), యు.సాయి శౌర్య (కృష్ణా), ఐ.దుర్గశ్రీ అఖిల్ (పశ్చిమ), వై.క్రిష్ (కృష్ణా), బాలికల విభాగంలో సాయి సంజనరెడ్డి (చిత్తూరు), ఎస్.లేఖ్యశ్రీ (పశ్చిమ), ఎ.శ్రీవైషాలి(కృష్ణా), జి.అక్షయ (శ్రీకాకుళం), పి.లోచన (తూర్పు)లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని టోర్నమెంట్ చీఫ్ రిఫరీ శ్రీకుమార్, ఎస్‌జీఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి జార్జి తెలిపారు.

న్యాయం చేయాలని వేడుకోలు


తనకు న్యాయం చేయాలని ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను కోరుతున్న యువతి

అమలాపురం టౌన్: అమలాపురం కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను అంబాజీపేటకు చెందిన ఓ యువతి తనకు న్యాయం చేయండంటూ వేడుకుంది. ఆ యువతి ఏడేళ్ల నాటి తన ప్రేమ పెళ్లి విషయంలో జరిగిన మోసాన్ని, పోలీసులు పెడుతున్న ఇబ్బందులను ఆ ప్రజాప్రతినిధులకు వివరించింది. సమావేశానంతరం ఎంపీ గంటి హరీష్ మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావులకు తనకు జరిగిన, జరుగుతున్న అన్యాయాన్ని చెప్పింది. 2017లో గౌస్ మొహిద్దీన్ అనే యువకుడు, తాను ప్రేమించుకున్నామని తెలిపింది. అతను పెళ్లికి నిరాకరించడంతో పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించానని చెప్పింది. పోలీస్ స్టేషన్‌లో అప్పట్లో ఆ యువకుడికి, తమకు అప్పటి ఎస్సై ఆర్.భీమరాజు సమక్షంలో పెళ్లి చేశారని పేర్కొంది. కేవలం 20 రోజులు తనతో ఉండి అతను తనను విడిచి వెళ్లిపోయాడని తెలిపింది. అప్పట్లో ఇదే సమస్యపై అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే చాన్నాళ్లు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపించింది. తర్వాత కొన్నేళ్లకు ఎఫ్ఐఆర్ వేసి కేసు నమోదు చేశారని పేర్కొంది. అప్పటి నుంచి కోర్టులో న్యాయం కోసం పోరాడుతున్నానని వివరించింది. అయితే అంబాజీపేట పోలీసులు ఇప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వాలని పదే పదే తనపై ఒత్తిడి తెస్తున్నారని చెప్పింది. కోర్టులో అప్పటి ఎస్సై భీమరాజుపై కేసు వేయగా ఇప్పుడు ఛార్జ్‌షీట్‌లో ఆయన పేరు లేకపోవడాన్ని ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు వివరించింది. దీంతో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అంబాజీపేట పోలీసు స్టేషన్‌కు ఫోన్ చేసి ఆ యువతి ఆవేదనను వివరించారు. న్యాయం జరిగేలా చేస్తామని ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఆమెకు హామీ ఇచ్చారు.

భర్తపై వేడి నూనె పోసిన భార్య


తీవ్రంగా గాయపడిన సాయికుమార్

అన్నవరం: భర్తపై వేడి నూనె పోయడంతో అతను తీవ్రంగా గాయపడి తుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా నకిరేకల్లుకు చెందిన మేకల సాయికుమార్, మండపం గ్రామ శివారు కొండ గైరంపేట చెందిన చాగంటి రాజ్యలక్ష్మికి ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. వీరు అన్నవరంలోని వెలంపేటలో నివాసం ఉంటున్నారు. రాజ్యలక్ష్మి ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోంది. కాగా, భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు అవుతుండడంతో సాయికుమార్ తన స్వగ్రామం వెళ్లిపోయాడు. అయితే భార్య అక్కడకు వెళ్లి కాపురానికి రాకపోతే పిల్లలను ఇక్కడే వదిలేస్తానని బెదిరించడంతో తిరిగి అన్నవరం వచ్చినట్లు సాయికుమార్ చెప్పాడని ఎస్ఐ తెలిపారు. మంగళవారం రాత్రి సాయికుమార్ ఇంటికి రాగా ఇంత ఆలస్యం ఎందుకు అయ్యిందని రాజ్యలక్ష్మి ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. గొడవ పెరగడంతో పొయ్యి మీద పెనంలో గల వేడి నూనెను సాయికుమార్‌పై ఆమె పోసింది. దీంతో అతని వీపు మీద చర్మం కాలి బొబ్బలెక్కడంతో హుటాహుటిన తుని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భర్త సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహరిబాబు తెలిపారు.